క్లుప్తంగా

భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే సదస్సులు



బోడిపాలెం(కాకుమాను):రైతుల భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బి.వెంకటస్వామి అన్నారు. మండలంలోని బోడిపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు తమ పంట భూముల సమస్యలను సదస్సులో అర్జీల రూపంలో అందజేయాలని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా భూమి కొలతల కోసం 12 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు మూడు భాషలపై పట్టు ఉండాలి



ప్రత్తిపాడు: విద్యార్థులు మూడు భాషలపై పట్టు సాధించేలా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధించాలని ఎంఈవో సీహెచ్. రమాదేవి అన్నారు. మండల పరిధిలోని పార్వతీపురం ప్రాథమిక పాఠశాలను బుధవారం మధ్యాహ్నం ఎంఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టికలతో పాటు రికార్డులను పరిశీలించారు. అనంతరం సబ్జెక్టుల వారీగా విద్యార్థుల విద్యా నైపుణ్యాలను పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు సులభంగా పాఠ్యాంశాలు అర్థమయ్యేలా టీఎల్ఎం ద్వారా పాఠాలు బోధించాలని తెలిపారు. విద్యార్థులు తెలుగు, ఇంగ్లీషు, హిందీ సబ్జెక్టులు చదవడం, రాయడం, మాట్లాడటం వచ్చేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశించారు.

కలుపు మందుల వినియోగంలో జాగ్రత్త అవసరం



పొన్నూరు: మినుము, పెసర, జొన్న పంటలలో కలుపు మందులు వినియోగంలో తగిన జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి డేగల వెంకట్రామయ్య సూచించారు. మండలంలోని ఉప్పరపాలెం, సీతారాంపురం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏట మినుము, పెసర, జొన్న పంటలలో యాజమాన్య పద్ధతులు, సస్య రక్షణ చర్యలు గురించి తెలియజేశారు. మినుము, పెసర పంటలలో నత్రజని, భాస్వరం, పొటాష్ పోషకాలను పిచికారీ చేస్తే ఆశించిన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది పి. దుర్గమ్మ, డి. యామిని, ఎస్. సురేష్ బాబు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల నిరశన



పొన్నూరు: పట్టణానికి చెందిన న్యాయవాది బేతాళ ప్రకాశరావుపై పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసును ఎత్తివేయాలని కోరుతూ న్యాయవాదులు పట్టణం ఐలాండ్ సెంటర్‌లో చేపట్టిన రిలే నిరాహారదీక్ష బుధవారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ వెంటనే న్యాయవాదిపై కేసు ఎత్తివేసి, అందుకు బాధ్యులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులపై దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చట్టాలను చేయాలని కోరారు. నిరసనకు పలు ప్రజ సంఘాలు మద్దతు తెలిపాయి.

నిర్దేశిత గడువులోగా సమస్యలకు పరిష్కారం



పొన్నూరు: మండలంలోని 20 గ్రామాల్లో గత నెల 6వ తేదీ నుంచి నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు అందజేసిన అర్జీలను పరిశీలించి నిర్దేశిత గడువులోగా పరిష్కరిస్తామని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ అన్నారు. ముగింపు సదస్సులో భాగంగా బుధవారం పచ్చలతాడిపర్రు గ్రామంలో సదస్సు నిర్వహించారు. భూమి రీసర్వే- 2, అడంగల్ కరక్షన్ కోసం- 5 అర్జీలను తహసీల్దార్ ప్రజల నుంచి స్వీకరించారు. కార్యక్రమంలో సర్వేయర్ సత్యనారాయణ, ఎండోమెంట్ ఈఓ రమేష్, వీఆర్ఓ, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్రాంతి 'అతిథులు' సందడి

- గ్రామాలో సయ్యాటలతో అలరిస్తున్న డూడూబసవన్నలు
- హరిదాసులు, పిట్టల దొరలు, కళాకారులతో కోలాహలం
- పల్లె ముంగిట సంక్రాంతి సరదాలు



డూడూ బసవన్నల సయ్యాటలు (ఫైల్)

ప్రత్తిపాడు: సంక్రాంతి అంటేనే సంప్రదాయాల కలబోత. ఆ పండుగ తెచ్చే సంప్రదాయాలు, సంబరాలు, సరదాలు, అనుభూతులు అన్నీ ఇన్నీ కావు. తెలుగునాట మూడు రోజుల పాటు ఉట్టిపడే ఈ పండుగకు వచ్చే అతిథులు ఎందరో ఉన్నారు. అతిథులంటే మనకు తెలిసిన బంధుమిత్రులు కాదండోయ్.. సంక్రాంతికి వచ్చే సంప్రదాయాలు, సంస్కృతినీ తెలియజేసే అతిథులు ! కాలం మారుతున్నా.. ఏవి అంటూ ఈ తరం కొత్త పుంతలు తొక్కుతున్నా.. మన సంస్కృతీ సంప్రదాయాలను మరిచిపోకుండా మూలాలను గుర్తు చేస్తుంటారు. సంక్రాంతికి మరో నాలుగు రోజులే సమయం ఉండటంతో పల్లెల్లో సంక్రాంతి సందడి మొదలవుతుంది. ఈ నేపథ్యంలో అందరికన్నా ముందుగా వచ్చే అతిథులెవ్వరో తెలుసుకుందాం.

హరిదాసులు



గ్రామాల్లో హరిదాసుల సంచారం

తెల్లవారకముందే తెల్లటి వస్త్రాల్లో తలపై అక్షయపాత్రతో, చేతిలో చిడతలతో హరిలోరంగ హరి.. అంటూ హరి నామస్మరణ చేస్తూ భక్తిగీతాలాపనలతో ఇంటి ముంగిటకు వస్తారు హరిదాసులు. ధనుర్మాసం ఆరంభం నుంచి సంక్రాంతి పండుగ ముగిసే వరకు వీరు వీధుల్లో సంచరిస్తారు. ప్రజలు ఇచ్చే ధాన్యం, పిండివంటలు, కానుకలను స్వీకరిస్తారు. సంక్రాంతి సంప్రదాయానికి వీరిని ప్రతీకలుగా చెప్పవచ్చు.

గంగిరెద్దుల విన్యాసాలు

పండుగకు నాలుగైదు రోజుల ముందు నుండే గ్రామాల్లో గంగిరెద్దుల సందడి కనిపిస్తుంటుంది. బసవన్నా.. అయ్యగారికి దండమెట్టు.. అంటూ పోషకులు గంగిరెద్దులతో ఇళ్ల ముంగిట చేయించే విన్యాసాలు, ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ప్రజలు వీరికి ధన, ధాన్యాలు, వస్త్రాలు సమర్పిస్తారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు గంగిరెద్దుల విన్యాసాలు చూసేందుకు ఆసక్తి చూపుతుంటారు.

బుడబుక్కల వాళ్లు



బుడబుక్కల వాళ్లు

చేతిలో ఢమరుకం.. ఒంటిపై నల్లని వస్త్రాలు ఒకదానిపై ఒకటి ధరించి, తలకు పెద్ద పాగా చుట్టి, నుదుటిన పెద్ద కుంకుమబొట్టు పెట్టుకుని, పెద్ద పెద్ద మీసాలతో భుజంమీద జంపకానా, కోటు ధరించి సంక్రాంతి సమయంలో వీరు గ్రామాల్లో సంచరిస్తుంటారు. భక్తి సంబంధ విషయాలు, భవిష్యత్తును ప్రజలకు వివరిస్తూ నీతి బోధలు చేస్తుంటారు. ఈ జాతి వారు చాలా వరకు కనుమరుగైనప్పటికీ, సంక్రాంతి వేళ మాత్రం గ్రామాల్లో అక్కడక్కడా కనిపిస్తుంటారు.

కొమ్మదాసరులు

మన పూర్వీకుల కాలంలో కొమ్మ దాసరులు సంక్రాంతి వేళ అధికంగా కనిపించేవారట. వీరు గ్రామాల్లో ఉన్న చెట్లపై కనిపించకుండా కూర్చుని దారిన వచ్చేపోయే వారి జాతకాలను వెటకారంగా, వ్యంగ్యంగా చెప్పేవారట. రానురానూ కాలం మారడంతో చెట్లపై కూర్చునే అవకాశం లేక. అలా చేసినా ఎవ్వరూ పట్టించుకునే పరిస్థితులు లేకపోవడంతో, వారే ఓ కొమ్మను చేతిలో పట్టుకుని వేకువజాము నుంచే తిరుగుతున్నారు. కనిపించిన వారందరినీ బంధుమిత్రుల వరసలతో పిలుస్తూ సరదాసరదాగా అల్లరి చేస్తుంటారని చెబుతున్నారు. వీరు కూడా చాలా అరుదుగానే గ్రామాల్లో కనిపిస్తున్నారు.

పగటి వేషగాళ్లు.. పిట్టల దొరలు

ఇక సంక్రాంతి సంబరాల్లో పగటి వేషగాళ్లు.. పిట్టల దొరల సందడి కూడా తక్కువేం కాదు. ఈ పెద్ద పండుగ అప్పుడు మాత్రమే కనిపించే ఈ కళాకారుల కళ మాటల్లో చెప్పలేనిది. చేతిలో తుపాకీ పట్టుకుని తలపై టోపీ పెట్టుకుని గ్రామాల్లోని వచ్చే పిట్టల దొరలు చేసే మాటల గారడీని మాటల్లో వర్ణించలేం. వారి వాక్చాతుర్యానికి ఎంతటి వారైనా ఫిదా అయ్యి వారెవ్వా అని వారికి నచ్చిన బహుమానం ముట్టచెప్పాల్సిందే. ఇక పగటి వేషగాళ్ల అంతరించిపోతున్నా.. అక్కడక్కడా పండగ సమయాల్లో మాత్రం మెరుపుతీగల్లా కనిపిస్తుంటారు. పులివేషాలు, దేవుళ్ల వేషాలు.. రకరకాల వేషాలు ధరించి వీధుల్లో తిరుగుతూ దానాలు తీసుకుంటుంటారు.

జంగమ దేవరులు

సంక్రాంతి వేళ కాకుండా.. ఇతర రోజుల్లోనూ గ్రామాల్లో కనిపిస్తుంటారు. వీరికి శివ శిష్యులుగా గ్రామాల్లో పేరు. మెడలో శివలింగం, నుదుటిన విభూది, చేతిలో శంఖం ధరించి భుజానికి సంచీతో గ్రామాల్లో సంచరిస్తుంటారు. ప్రజలు ఇచ్చే భిక్షను స్వీకరించి జంగమేశ్వరునికి వినిపించేలా ఇంటి ముంగిట నిలబడి శంఖం ఊది వెళ్లిపోతారు.

అంబరాన్నంటిన ముందస్తు సంక్రాంతి సంబరాలు

కాకుమాను:స్థానిక నన్నపనేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. విద్యార్థులతో అనేక రకాల వేషధారణలు వేయించి పాఠశాల ఆరణలో మానవహారం ఏర్పాటు చేశారు. భోగి మంటలతో పాటు కోలాటం చేశారు.ఈ సందర్భంగా హెచ్ఎం సత్యం మాట్లాడుతూ విద్యార్థులు తమ కలలు, ఆకాంక్షలను గాలిపటాల్లా ఎగురవేయాలని తెలిపారు.ఎంచుకున్న లక్ష్యాలను పట్టుకున్న దారాల్లాగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. పండుగ విద్యార్థుల జీవితాలలో సరికొత్త వెలుగులు నింపి, మంచి లక్షణాలను కలిగి విజయాలతో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన తెలిపారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓలు

ముందస్తు సంక్రాంతి సంబరాల్లో భాగంగా పాఠశాలలోని విద్యార్థులకు వివిధ రకాల ఆటలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి.సత్యం, ఎంఈవోలు కె.ఎఫ్.కెనడీ, కె.విజయ్ భాస్కర్, ఇస్రో మాజీ శాస్త్రవేత్త నూతి సత్యనారాయణ,పొన్నూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మామిళ్లపల్లి రాంగోపాల్, నన్నపనేని పూర్ణయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ భారత్' ఆశయానికి నిర్లక్ష్యం తుప్పు

పెదకాకాని: అధికారుల నిర్లక్ష్యంతో చెత్త సేకరణ రిక్షాలు తుప్పు పడుతున్నాయి. ముళ్ల పొదల్లో పెరిగిన చెట్ల మధ్య దర్శనమిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా పెదకాకాని మండలంలోని పలు గ్రామాలకు జనాభా ఆధారంగా రిక్షాలు పంపిణీ చేశారు. ఇళ్ల సంఖ్య ఆధారంగా గ్రీన్ అంబాసిడర్‌లను కూడా ఏర్పాటు చేశారు. పలువురు కార్యదర్శులు కూడా గ్రీన్ అంబాసిడర్‌లకు వేతనాలు మంజూరు ఆలస్యం కావడంతో పంచాయతీ నిధుల నుంచి డ్రా చేసి చెల్లించారు. ఈ తరువాత వచ్చిన వేతనాలను ఎకౌంట్‌లో జమ చేయకుండా సొమ్ము చేసుకున్నారు. ఇళ్ల నుంచి చెత్త సేకరించేందుకు డస్ట్‌బిన్‌లు కూడా పూర్తిస్థాయిలో పంచకపోవడంతో అవి పంచాయతీలలోనే మూలుగుతున్నాయి. కార్యదర్శుల బాధ్యతారాహిత్యం కారణంగా రూ. 15 వేల నుంచి రూ.20 వేలతో కొనుగోలు పంపిణీ చేసిన రిక్షాలు పెదకాకాని, నంబూరు, వెనిగండ్ల, తదితర పంచాయతీల్లో పదుల సంఖ్యలో తుప్పు పట్టాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రిక్షాలను తుప్పు పట్టకుండా చూడాలని, రోడ్లపై పేరుకు పోతున్న చెత్తను సకాలంలో సేకరించాలని ప్రజలు కోరుతున్నారు.



వెనిగండ్ల పంచాయతీలో తుప్పు పడుతున్న రిక్షాలు

రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు నజ్మా ఎంపిక

చేబ్రోలు: రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో చేబ్రోలు మండలం నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్‌కే నజ్మా ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచింది. పుదుచ్చేరిలో సదరన్ ఇండియా సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం ఎం. ఏడుకొండలు బుధవారం తెలిపారు. జనవరి 7,8వ తేదీలలో విజయవాడ రూరల్‌లోని మురళి రిసార్ట్ నందు జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్ పోటీలలో ఎస్‌కే నజ్మా ఉత్తమ ప్రదర్శన కనబరిచి సెంట్రల్ ఇండియా లెవల్ పోటీలకు ఎంపికైంది. మెమెంటో, మెరిట్ సర్టిఫికెట్‌లను అందుకుంది.వ్యక్తిగత విభాగంలో ఎస్.కె నజ్మా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు కోసం తయారుచేసిన సర్వింగ్ రోబోట్ ఎగ్జిబిట్ సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్ ప్రాజెక్ట్‌కు ఎంపికైంది. జనవరి 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు పుదుచ్చేరిలో జరిగే సందరన్ ఇండియా సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొననున్నది. విద్యార్థిని నజ్మా, గైడ్ టీచర్ అరుణ కుమారిలను జిల్లా విద్యాశాఖాధికారిణి సి.వి. రేణుక, జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్ మీరా, ప్రధానోపాధ్యాయుడు ఎం. ఏడుకొండలు అభినందించారు.



నజ్మాకు మెమెంటో, సర్టిఫికెట్‌ను అందజేస్తున్న అధికారులు

కిట్స్ అధ్యాపకుడికి డాక్టరేట్



ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్-డాటా సైన్స్ విభాగానికి చెందిన అధ్యాపకుడు తూము సుబ్బారెడ్డికి డాక్టరేట్ లభించింది. ఆప్టిమైజింగ్ టైమ్ సిరీస్ ఫోర్కాస్టింగ్ ఆన్ స్టాక్ ప్రైస్ విత్ ఎన్హన్స్‌డ్ సపోర్ట్ వెక్టార్ రిగ్రెషన్ మోడల్స్ యూసింగ్ హ్యూరిస్టిక్ డైవెర్సె కెర్నెల్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను అనంతపురంలోని శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ సుబ్బారెడ్డికి డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు తెలిపారు. యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్. గీతాంజలి పర్యవేక్షణలో పరిశోధన చేసినట్లు చెప్పారు. బుధవారం స్థానిక కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు సుబ్బారెడ్డిని అభినందించారు.

10న ముక్కోటి ఏకాదశి పూజలు

గుంటూరు రూరల్: నల్లపాడు రోడ్డు వెంగళాయపాలెంలోని స్వయంభూ శ్రీ పుష్పాద్రి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఈనెల 10న వైకుంఠ ఏకాదశి (ముక్కోటి ఏకాదశి) సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బుధవారం తెలిపింది. స్వామికి ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, నవనీతహారతి, తోమాలసేవ, సహస్రనామఅర్చన హారతి, మంత్రపుష్పం, అభిషేకాలు, హోమాలు జరుగుతాయని వివరించింది. భక్తులకు దక్షిణావత శంఖంతో తీర్థ ప్రసాద వినియోగం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులందరూ పాల్గొనాలని కోరారు.

అక్రమంగా గోవుల తరలింపుపై కేసు నమోదు

గుంటూరు రూరల్: అక్రమంగా గోవులను తరలిస్తున్నట్లు సమాచారం మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. రాష్ట్ర హైందవ డెవలప్‌మెంట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు బెహర వెంకట అనిల్ హైందవ శంఖారావానికి వెళ్లి వెళ్లి వస్తుండగా బుడంపాడు హైవేపై కంటెనర్‌లో అక్రమంగా గోవులను తరలిస్తున్నట్లు గుర్తించి నల్లపాడు పోలీసులకు సమాచారం అందించాడు. ఆ తర్వాత మరో వాహనం రాగా అందులోనూ అందులోనూ గోవులున్నట్లు గురించారన్నారు. కంటెయినర్ లారీల డ్రైవర్‌లను ప్రశ్నించగా రాజశేఖర్ అనే వ్యక్తి గోవులను కబేళాకు తరలిస్తున్నాడని తెలిపారు. అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు గోవులను రక్షించి గోశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

లేగదూడలకు అంతిమ సంస్కారాలు

పెదకాకాని: ఆవుదూడలకు బుధవారం గ్రామస్తులు శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు. మండలంలోని వెనిగండ్లలో దేవుడి ఆలయం పేరిట భక్తులు విడిచిపెట్టిన ఆవులు, వాటి దూడలు చాలా కాలంగా తిరుగుతూ ఉంటాయి. పలువురు వాటికి ఆహారం పెడుతూ ఉంటారు. ఎప్పటి మాదిరిగానే మంగళవారం సాయంత్రం గ్రామంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయ ఆవరణకు చేరుకుని అస్వస్థతకు గురికావడంతో పశు వైద్యుడికి సమాచారం అందించి సేవలు అందించారు. కొంత సమయం తరువాత రెండు దూడలు చనిపోయాయి. బుధవారం గ్రామ సర్పంచి వేల్పుల శ్రావణి పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావుకి సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్నారు. జేసీబీ సహాయంతో ఆ దూడలను గ్రామ శివార్లలోకి చేర్చి పసుపు, కుంకుమలతో పూజలు చేసి గోతిలో పూడ్చి పెట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి కొండమడుగుల శ్రీనివాసరెడ్డి, మన్నెం లతీఫ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్న పంచాయితీ కార్యదర్శి వెంకటేశ్వరరావు

కనుల పండువగా శ్రీవారి కల్యాణం



గుంటూరు రూరల్: గోరంట్లలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం (పెద్దగుడి)లో దశావతార కల్యాణ మహోత్సవాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. కలియుగ దైవం శ్రీ వేంకటేస్వామి కల్యాణ మహోత్సవాన్ని బుధవారం కన్నుల పండుగగా నిర్వహించారు. భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం కార్యక్రమంలో భాగంగా శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమంలో దేవాలయం అధ్యక్షుడు యర్రంశెట్టి వేణుగోపాల్, చైర్మన్ కంచర్ల ఆంజనేయులు, సెక్రటరీ గజవల్లి శివన్నారాయణ, కోశాధికారి దేవరశెట్టి సురేష్‌బాబు, వైస్ ప్రెసిడెంట్ ఆళ్ల శివారెడ్డి, జవ్వాది సుబ్బారావు, కాబోలు పూర్ణచంద్రరావు, సూరె శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

80 శాతం రాయితీపై వ్యవసాయ డ్రోన్లు

ప్రత్తిపాడు: రైతులకు వ్యవసాయ ఆధారిత డ్రోన్లను ప్రభుత్వం 80 శాతం రాయితీపై అందిస్తోందని మండల వ్యవసాయాధికారి కె. అరుణకుమారి అన్నారు. మండల పరిధిలోని తుమ్మలపాలెం, యనమదల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. రబీలో సాగు చేసిన పంటలను పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని రైతు సేవ కేంద్రాల్లో రైతులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. జనవరి 15వ తేదీలోగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) ప్రీమియం చెల్లించాలని తెలిపారు. రబీలో పంటలు సాగు చేసిన రైతులు ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. శనగ, మొక్కజొన్న పంటలు రైతు సేవ కేంద్రాల ద్వారా కొనుగోళ్లు జరగాలంటే ఈక్రాప్ తప్పనిసరని తెలిపారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన నిరుద్యోగ యువతకు రాయితీపై డ్రోన్లు సరఫరా చేయడంతో పాటు, శిక్షణను కూడా ఉచితంగా ఇస్తున్నట్లు చెప్పారు. ప్రత్తిపాడు మండలానికి రెండు డ్రోన్లుకు అవకాశం ఉందని, ఆసక్తి ఉన్న వారు వ్యవసాయశాఖ కార్యాలయంలో లేదా సిబ్బందిని సంప్రదించాలని అరుణకుమారి కోరారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్‌తో సామాజిక, సాంస్కృతిక అభివృద్ధి



అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: కమ్యూనికేషన్‌తో సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అభివృద్ధి జరుగుతుందని మలినేని ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డీన్ కిశోర్ తెలిపారు. బుధవారం నగర శివారుల్లోని లాం సందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో 'రోల్ ఆఫ్ హ్యూమన్ ఇన్ కమ్యూనికేషన్' అనే అంశంపై మోటివేషనల్ క్లాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనికేషన్ లేకుండా మానవ సంబంధాలు అసాధ్యంగా మారుతాయని చెప్పారు. మానవ కమ్యూనికేషన్ వ్యక్తిగత, సామాజిక, వృత్తిపరమైన సంబంధాలను బలోపేతం చేస్తుందని తెలిపారు. మాటల ద్వారా కమ్యూనికేషన్ (వెర్బల్), మౌన సంకేతాల ద్వారా కమ్యూనికేషన్ (నాన్-వెర్బల్), టెక్నాలజీ ద్వారా కమ్యూనికేషన్ (డిజిటల్) అన్ని కూడా సమాజం అభివృద్ధికి అవసరమైనవని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ టెక్నాలజీ ద్వారా ప్రపంచం అంతా ఒక చిన్న గ్రామంలా మారిందని తెలిపారు. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అభివృద్ధికి కమ్యూనికేషన్ దోహదపడుతుందని చెప్పారు. సమర్థమైన కమ్యూనికేషన్ వ్యక్తిగత జీవితంలో విజయానికి, సమాజంలో అనుబంధానికి పునాదిగా ఉంటుందని తెలిపారు. కమ్యూనికేషన్ సామర్థ్యాలు మెరుగుపరుచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని చెప్పారు. కార్యక్రమ అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశభక్తి పెంచేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ దోహదం



విద్యార్థులతో ఎంఈఓలు, ఉపాధ్యాయులు

పొన్నూరు: విద్యార్థులలో దేశభక్తి, పరోపకారం, క్రమశిక్షణ, సోదరభావం పెంపొందడానికి భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతో ఉపయోగ పడుతుందని గుంటూరు జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి ఎం. ఏడుకొండలు పేర్కొన్నారు. మండలంలోని మామిళ్లపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం స్కౌట్ అండ్ గైడ్స్ కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఈ కేంద్రాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్కార్ఫ్, యూనిఫాంలను అందించారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఆర్. చలపతిరావు, కె. శ్రీనివాసరెడ్డి, హెచ్ఎం ఎం. బాలఏసు, సీహెచ్. రమేష్, కె. నీలాబాయి. టి.నరేష్, ఉమాదేవి, సీఆర్‌పీ దాసు పాల్గొన్నారు.

పెదనందిపాడులో కేటుగాళ్లు

కస్టమర్‌లా వచ్చి క్యాష్ కౌంటర్‌పై ఉన్న మొబైల్ కొట్టేసిన ఆగంతకుడు



ఫోన్ కొట్టేస్తున్న ఆగంతకుడి చిత్రం

ప్రత్తిపాడు: పెదనందిపాడులో కేటుగాళ్లు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. సీసీ కెమెరాలున్నాయన్న భయం కూడా లేకుండా నిర్భయంగా దుకాణంలోకి వచ్చి ఫోన్‌ను తస్కరించిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోనికి వెళితే.. పెదనందిపాడు మెయిన్ రోడ్డులోని ఎస్ఎస్ మార్ట్‌లో బుధవారం ఉదయం 11.20 గంటల సమయంలో దుకాణంలోకి ఆగంతకుడు కస్టమర్‌లా ప్రవేశించాడు. ఎదురుగా ర్యాక్‌లో సరుకులు చూస్తున్నట్లుగా నటిస్తూ, ఎవ్వరూ చూడని సమయంలో పక్కనే క్యాష్ కౌంటర్‌పై ఉన్న సెల్‌ఫోన్‌ను కాజేశాడు. ఈ దృశ్యాలన్నీ దుకాణంలో సీసీటీవీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. పుటేజీ బయటకు రావడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గతంలోనూ ఇదే గ్రామంలో ఇలా ఓ దుకాణంలో సెల్‌ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. తాజాగా మరో ఘటన కూడా పట్టపగలే జరగడంతో వ్యాపారస్తులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలకు పూల మొక్కల బహూకరణ



పూల మొక్కలను అందజేస్తున్న ప్రేరణ శిక్షణా సేవా సంస్థ ప్రతినిధులు

వేజండ్ల(చేబ్రోలు): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటడంతో పాటు వాటిని పరిరక్షించాలని చేబ్రోలు మండల విద్యాశాఖాధికారి రాయల సుబ్బారావు అన్నారు. మండలంలోని వేజండ్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ప్రేరణ శిక్షణా సంస్థ ప్రతినిధులు పూల మొక్కలను అందజేశారు. గులాబీ, చేమంతి, క్రోటన్ తదితర 60 మొక్కలను పాఠశాల హెచ్ఎం పరాశరం శ్రీనివాసమూర్తికి అందజేశారు. పాఠశాల ప్రాంగణంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సేవాసంస్థ ప్రతినిధులు మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంఈవో ఆర్. సుబ్బారావు, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం కే విజయశ్రీ, సేవాసంస్థ ప్రతినిధులు కృష్ణారెడ్డి, అనంతలక్ష్మి, శివకుమారి పాల్గొన్నారు.

శలపాడు పాఠశాలకు పూలకుండీలు అందజేత

చేబ్రోలు: మండలంలోని శలపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రిటైర్డ్ డీఎస్పీ పూల కుండీలను బుధవారం అందజేశారు. శలపాడు గ్రామానికి చెందిన రిటైర్డు డీఎస్పీ భద్రాచలం 20 సిమెంటు పూల కుండీలను అందజేశారు. దీనిలో ఆకర్షణీయమైన మొక్కలను పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజా అవగాహన కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా రామిరెడ్డి



పెదకాకాని: ప్రజా సంకల్ప వేదిక ప్రజా అవగాహన కమిటీ రాష్ట్ర అధ్యక్షునిగా కొండమడుగుల రామిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు గుంటూరు జిల్లా పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి కొండమడుగుల రామిరెడ్డిని ప్రజా అవగాహన కమిటీ రాష్ట్ర అధ్యక్షునిగా నియమిస్తూ ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మదిరె రంగసాయిరెడ్డి నియామక పత్రాలు అందజేశారు. పెదకాకాని గ్రామానికి చెందిన వరికుంట ఏసయ్యను రాష్ట్ర మీడియా సెక్రటరీగా, హ్యూమన్‌రైట్స్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా కట్టెపోగు నాగేశ్వరరావు, అవినీతి నిరోధకశాఖ మొండితోక సుబ్బారావులను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సేవే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రజా సంకల్ప వేదికలో తన వంతు సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. తన నియామకాన్ని ప్రకటించిన మధిరె రంగసాయిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రజా అవగాహన కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రామిరెడ్డి మాట్లాడుతూ ప్రజా సేవే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రజా సంకల్ప వేదికకు సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. తన నియామకాన్ని ప్రకటించిన మధిరె రంగసాయిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.